102 'అమ్మఒడి' వాహనాలను వినియోగించుకోండి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గర్భిణులు 102 అమ్మఒడి వాహనాలను వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్. రఘునాథ్‌స్వామి తెలిపారు. అక్టోబర్‌లో 102 అమ్మఒడి వాహనాల ద్వారా సేవలు పొందిన గర్భిణుల జాబితాను డీఎంహెచ్‌ఓకు అందజేసినట్లు 108 వాహనాల ప్రోగ్రాం మేనేజర్ షేక్‌జాన్‌షాహిద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రెగ్నెన్సీ మహిళలు వైద్య పరీక్షల కోసం ఇంటి నుంచి ఆసుపత్రులకు అక్కడి నుంచి మళ్లీ ఇంటికి చేరేందుకు ఉచిత రవాణా సౌకర్యం కోసం 102 అమ్మఒడి వాహనాన్ని వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్నీ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులకు ఈ సమచారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 108 వాహనాల జిల్లా సమన్వయ కర్త విజేందర్ పాల్గొన్నారు. ఇందులో 102 వాహనాల పనితీరుపై డీఎంహెచ్‌ఓ రఘునాథ్ సంబంధిత అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్(ఈసీఐఎల్)లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌స్వామి తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్(డీఎంఎస్‌ఓటీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులలో ప్ర వేశానికి అవకాశం ఉందన్నారు. ఈ కోర్సులకు ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరమన్నారు. కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు ఉంటుందని, ప్రతి కోర్సులో 30 సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 21 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులను అందించాలని, పూర్తి వివరాలకు కుత్బుల్లాపూర్ (ఈసీఐఎల్) ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని డాక్టర్ రఘునాథ్‌స్వామి సూచించారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి

ఆలయాలకు పోటెత్తిన భక్తులు ● ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వ్రతాలు


నిజాంపేట్ వాటర్ ట్యాంక్ వద్ద మల్లన్న గుడి వద్ద ..

నియోజకవర్గవ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు క్యూకట్టారు. శివాలయాలు, వైష్ణవాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా దీపాలు వెలిగించారు. పలు ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. – కుత్బుల్లాపూర్, జోన్ బృందం


ప్రసూనగర్ శ్రీకోదండ రామాలయంలోని శివాలయంలో..


నల్లగుట్ట శ్రీలక్ష్మీనరసింహ ఆలయంలో పూజల్లో నాయకులు


పద్మానగర్ ఫేజ్–లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో వ్రతాలు..


ఉమామహేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు..


జగద్గిరిగుట్ట కొండపై శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో..


సూరారం ఉమామహేశ్వర ఆలయంలో భక్తుల సందడి


నల్లగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వ్రతాల్లో భక్తులు..

22న జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్

దుండిగల్: గండిమైసమ్మలోని ఎస్‌ఎస్‌కేకే హైస్కూల్‌లో ఈనెల 22న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు మేడ్చల్ జిల్లా డీఈవో శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనే విద్యార్థుల కోసం ఈనెల 17వ వరకు రిజిస్ట్రేషన్లు నమోదు చేస్తున్నామని, 2023–24 విద్యా సంవత్సరంలో ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌లో సెలెక్ట్ అయిన విద్యార్థులు తప్పకుండా తమ ప్రాజెక్ట్‌లను ప్రదర్శించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ తప్పనిసరని, లేకుంటే ప్రాజెక్ట్‌ల ప్రదర్శనకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి, సీనియర్ విభాగంలో 9, 10 తరగతుల విద్యార్థులు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి సీనియర్, జూనియర్ పాల్గొనేలా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌స్పైర్‌లో పాల్గొనే విద్యార్థులు ఆన్‌లైన్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఎంఈవో కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

18 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


ఇన్‌స్పెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండలోని పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు బస్తీ అధ్యక్షుడు చెట్ల వెంకటేశ్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సూరారం ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ప్రతిష్ఠ అన్నదానం ప్రత్యేక కార్యక్రమాలతో వేడుకలు ముగుస్తాయని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ హత్య



దుండిగల్: గుర్తు తెలియని మహిళ దారుణ హత్యకు గురైన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లి కాకతీయ లేఅవుట్‌లోని ఓ ప్లాట్‌లో మహిళా మృతదేహం పడి ఉందని స్థానికుల ద్వారా పోలీసులు సమాచారం అందుకున్నారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మహిళా మృతదేహానికి పంచనామా నిర్వహించారు. సదరు మహిళ వయసు 40–45 ఏళ్ల మధ్య ఉంటుందని, ముఖం, ఇతర శరీర భాగాలపై గాయాలున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలంలో రక్తపు మరకలు ఉండటంతో సదరు మహిళకు మద్యం తాగించి ఘాతుకానికి ఒడిగట్టి తదనంతరం హత్యచేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని వైన్స్ దుకాణాలు, కల్లు కాంపౌండ్ వద్ద సీసీ ఫుటేజీలను సేకరించి దర్యాప్తును ముమ్మరం చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

మురుగు పరుగు..!


రాంరెడ్డినగర్‌లో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

జీడిమెట్ల: సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లోని సూపర్‌గ్యాస్ రోడ్డులో మ్యాన్‌హోల్ నుంచి ఏడాదిగా మురుగునీరు రోడ్డుపై పారుతూనే ఉంది. దీంతో రోడ్లపై నడవాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన తూతూ మంత్రంగా వచ్చి పని చేసి వెళ్తున్నారే తప్పా శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పట్టించుకుని భూగర్భ డ్రై నేజీ లీకేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దారి దోపిడీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: దారి దోపిడీకి పాల్పడుతున్న నలుగురిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 6 మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, డీఐ రవికుమార్ వివరాలు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన బీర్బల్ సింగ్ బీబా, బాగేందర్ సింగ్, గండి మైసమ్మ ప్రాంతానికి చెందిన రవిసింగ్ బౌరీ, దండు నగేశ్ జల్సాలకు అలవాటు పడి దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్నారు. వీరు మంగళవారం అర్ధరాత్రి కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నంబర్ 1 నుంచి కేపీహెచ్‌బీ 4వ ఫేజ్‌కు వెళ్లే దారిలో నిర్మానుష్య ప్రాంతంలో బైక్‌లపై వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడి ఒకరి నుంచి సెల్‌ఫోన్‌తో పాటు ఒకటిన్నర తులం బంగారు గొలుసును మరోకరి నుంచి సెల్‌ఫోన్ లాక్కున్నారు. దీంతో ఇద్దరు బాధితులు మురహరిశెట్టి అంకంరావు, శనకుమల వెంకటసురేశ్ బుధవారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. ఈ మేరకు వారిని రిమాండ్‌కు తరలించారు. ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ డయల్ 100కు గానీ, కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ నెంబర్ 8333993413 కు సమాచారం అందించాలని ఏసీపీ శ్రీనివాసరావు కోరారు.

నల్లపోచమ్మ ఆలయానికి విరాళం

ఆల్విన్‌కాలనీ: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఎన్టీఆర్‌నగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయానికి జిల్లా గణేశ్ నేత రూ. 20 వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మల్లేశ్, నాగరాజు, సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



కుత్బుల్లాపూర్: విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు నేపథ్యంలో ఈనెల 16న కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేట్‌బషీరాబాద్ ఏఈ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ బాలాజీ ఆస్పత్రి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెనోవా ఆస్పత్రి, కాస్‌హోటల్, ఎస్‌పీజీ గ్రాండ్, శ్రీని ఎవెన్యూ, హైటెన్షన్ రోడ్డు, అంగడిపేట్ గ్రామం, 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, ఎస్‌ఎల్‌ఎన్ డెవలపర్స్, డీమార్ట్ వెనుక గల్లీ, హర్ష ఆస్పత్రి ప్రాంతం, 11 కేవీ సత్యం ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దండమూడి ఎన్‌క్లేవ్, ఫుల్లారెడ్డి స్వీట్‌హౌస్, అంకుర ఆస్పత్రి, సురక్ష ఆస్పత్రి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

11కేవీ కేవీఆర్ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: ఫీడర్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ కేవీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తిరిగి 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్‌ఉడ్ జేఎన్‌ఎస్ విల్లాస్, స్టెర్లింగ్ హోమ్స్, ప్రణీత్ నేచర్‌బౌంటీ, 11కేవీ భౌరంపేట్ గ్రామ ఫీడర్ పరిధిలోని భౌరంపేట్ గ్రామం, ల్యాండ్‌మార్క్–2, కీర్తి హోమ్స్, అక్షయ్ డెవలపర్స్, బ్లూమ్స్, ప్రణీత్ మిడోవ్స్, 11కేవీ భౌరంపేట్ ఫీడర్ పరిధిలో సారెగూడెం రోడ్డు, క్రీక్ స్కూల్, 11కేవీ లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లక్ష్మీనగర్, సూరారం గ్రామం, అయ్యప్ప సొసైటీ, విశ్వకర్మకాలనీల్లో సరఫరా ఉండదని తెలిపారు.

ప్రగతినగర్ సెక్షన్ పరిధిలో..

11కేవీ జగన్ స్టూడియో ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఎన్‌ఆర్‌ఐ కాలనీ, విష్ణుప్రియనగర్, అక్షర స్కూల్, గౌతమి మోడల్ స్కూల్, 11కేవీ మధురనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు డాక్టర్ కాలనీ, డాలర్ హోమ్స్, అంబ భవానీ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రగతినగర్ ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు.

మర్యాదపూర్వక కలయిక


కూన శ్రీశైలంగౌడ్‌తో సంక్షేమ సంఘం సభ్యులు

కుత్బుల్లాపూర్: షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ను పలువురు నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఆయన స్పందిస్తూ కాలనీల అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. అదేవిధంగా పలు శుభకార్యాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు అందజేశారు.

డిప్యూటీ కమిషనర్‌కు సన్మానం



మోతీనగర్: అవంతినగర్ కాలనీకి మొదటిసారిగా వచ్చిన జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ వంశీ పైడిపల్లిని సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి రాఘవేందర్ శాలువాతో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. రంగప్ప, వజ్రం, మల్లయ్య, నర్సింహులు, రాకేశ్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సంతృప్తి

మోతీనగర్: ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటే ఎంతో సంతృప్తి లభిస్తుందని షణ్మి కనస్ట్రక్షన్ ఎండీ జే లక్ష్మణ్ గుప్తా పేర్కొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా చౌడాపూర్ మండలం మద్దిమాల్ గ్రామానికి చెందిన కావలి అంజయ్య, నర్సమ్మ కూతురు రాణి వివాహం నిశ్చయం అయింది. అయితే రాణిది నిరుపేద కుటుంబం కావడంతో కాంగ్రెస్ నాయకుడు సుగం శెట్టి మహేశ్ ద్వారా విషయాన్ని తెలుసుకున్న లక్ష్మణ్ గుప్తా దంపతులు శుక్రవారం వధువు రాణిని గాయత్రినగర్ లక్ష్మీ నివాసంలో శుక్రవారం నూతన వస్త్రాలు, పుస్తె, మట్టెలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఆదపలో ఉన్నవారికి విద్య, వైద్యం వంటి సహకారాలు అందిస్తున్నానని తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆఫీసర్'

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఈనెల 16న (నేడు) 'డయల్ యువర్ ఆఫీసర్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ కవిత శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, మియాపూర్ 2, హెచ్‌సీయూ, మేడ్చల్ డిపోల ప్రాంతంలోని ప్రయాణికులు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఫోన్ 9959226148 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించడంతో పాటు సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

మెరుగైన జీవన విధానానికే సమగ్ర సర్వే


ఎన్యుమరేటర్‌కు వివరాలు తెలుపుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: ప్రజల స్థితిగతులను తెలుసుకుని ఉత్తమ జీవన ప్రమాణాలు అందించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టిందని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్‌లోని తన నివాసంలో శుక్రవారం ఎన్యూమరేటర్లు కులగణనకు సంబంధించి వివరాలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజింగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టిందని, ప్రతిపక్షాలు ప్రజల్లో అపోహలు కలిగించేలా రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు తమ ఇళ్లకు వచ్చే సిబ్బందికి పూర్తి వివరాలు అందజేసి సహకరించాలని ఆమె కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలు వీడాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి సత్యం తదితరులు

నిజాంపేట్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీపీఐ(ఎం) మేడ్చల్ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో మేడ్చల్ జిల్లా సీపీఐ(ఎం) మూడో మహాసభ పోస్టర్‌ను శుక్రవార ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలో పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా నివసిస్తున్నారని, అదేవిధంగా గేటెడ్ కమ్యూనిటీలు సైతం అనేకమున్నాయన్నారు. అయితే అన్ని ప్రాంతాలకు సరైన వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యారన్నారు. మేడ్చల్ ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. ఈ మహాసభల సందర్భంగా స్థానిక సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ కృష్ణారావు, జిల్లా నాయకులు వరప్రసాద్, సంతోష్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి లక్ష్మణ్, మేడ్చల్ మండల కార్యదర్శి నరేశ్, కూకట్‌పల్లి మండల కార్యదర్శి శంకర్, బాలానగర్ మండల కార్యదర్శి రాజశేఖర్, బాచుపల్లి మండల నాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల కోసమే 'కల్యాణలక్ష్మి'


కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

నిజాంపేట్: నిరుపేదల కోసమే రాష్ట్ర ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. బాచుపల్లిలోని కార్యాలయంలో జయరామ్‌నగర్‌కు చెందిన భారతికి రూ.1,00016 కల్యాణ లక్ష్మి చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బేకు శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్, కుమార్ యాదవ్, శ్రీధర్ వర్మ, అనిల్, లక్ష్మి, అందాలు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

చింతల్: జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఇటీవల భగత్‌సింగ్‌నగర్‌లో బాక్స్ నాలా మూతలను తొలగించి వ్యర్థాలను ఎత్తిపోశారు. అనంతరం బాక్స్ నాలాపై ఉన్న మూతలను సక్రమంగా అమర్చకపోగా ఒకదానిపై మరొకటి పెట్టి వెళ్లిపోయారు. దీంతో ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులు సమీపంలోకి రాగానే వీటిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేగాకుండా ఈదారి గుండా నడుచుకుంటూ వెళ్లేవారు సైతం పలువురు ప్రమాదాల బారిన పడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి ఓపెన్ చేసిన బాక్స్ నాలాలపై మూతలు సక్రమంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



తాపీమేస్త్రీలకు గిఫ్ట్‌లు అందజేస్తున్న భారతి సిమెంట్స్ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్

కుత్బుల్లాపూర్: భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5 స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని, దీనిద్వారా నిర్మాణ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ శివకుమార్ అన్నారు. గండిమైసమ్మలోని శ్రీనివాస స్టీల్ సిమెంట్ డీలర్ దుకాణంలో తాపీ మేస్త్రీలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. తమ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని, స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన తమ ఇంజినీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయ పడవుతారన్నారు. ఈ సందర్భంగా డీలర్ జయంత్ రెడ్డి మాట్లాడుతూ భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మార్కెటింగ్ రాజేంద్రప్రసాద్, 20 మంది తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఇన్‌కాయిన్ సెంటర్ సందర్శన


ఇన్‌కాయిస్ అధికారులతో సమావేశమైన బిర్లా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల బిర్లా

నిజాంపేట్: ప్రగతినగర్‌లోని ఇన్‌కాయిన్ సెంటర్‌ను బిర్లా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిర్మల బిర్లా, బిర్లా సైన్స్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కె.ఎం.రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఇన్‌కాయిస్ డైరెక్టర్ బాలకృష్ణనాయర్ తాము అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ నిర్మల బిర్లా మాట్లాడుతూ ఇన్‌కాయిస్ అందిస్తున్న సేవలను బిర్లాసైన్స్ కేంద్రంలో ప్రదర్శించాలని, ఇందుకు తమ పూర్తి సహకారం ఉంటుందన్నారు. దీనిపై స్పందించిన కేఎం రెడ్డి సైన్స్‌పరమైన విజ్ఞానాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇన్‌కాయిస్ సంస్థ సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగేశ్వరరావు శ్రీరంగం, అసిస్టెంట్ మేనేజర్ దాసరి ప్రసాద్, హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్ సీఏ శ్యామ్‌కొఠారి తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

మేడ్చల్‌రూరల్: అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి వైన్స్‌లో చొరబడి నగదుతో పాటు మద్యం బాటిళ్లు దోచుకెళ్లిన ఘటన మేడ్చల్‌లో చోటు చేసుకుంది. మేడ్చల్ చెక్‌పోస్ట్‌లోని రేణుకా ఎల్లమ్మ వైన్ షాప్‌ను యాజమానులు రోజులానే గురువారం రాత్రి షాపు మూసివేసి వెళ్లారు. అర్ధరాత్రి వైన్స్‌లోకి చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తి షాపులో ఉన్న రూ.8 వేల నగదుతో పాటు మద్యం బాటిళ్లను దోచుకుని పరారయ్యాడు. దొంగతనం దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదవ్వడంతో.. యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తి అదృశ్యం

జవహర్‌నగర్: వ్యక్తి అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాప్రా ఎల్లారెడ్డిగూడలో నివసించే సంగ సంతోష్ (32), భార్య నవనీత, కుమారుడు, అత్తమామలతో కలిసి ఉంటున్నారు. ఈ నెల 13న దుస్తులు సర్దుకుని ఇంటి నుంచి వెళ్లిన సంతోష్ తిరిగిరాలేదు. పనిచేసే షాపునకు వెళ్లి ఉంటాడని యజమానిని సంప్రదించగా 7 వ తేదీ నుంచి షాపునకు రావడం లేదని తెలిపారు. దీంతో ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.